

# పశ్చాత్తాపం

కొడవటిగంటి కుటుంబరావు

నేను గౌరవ మర్యాదలు కల కుటుంబంలో పుట్టినవాణ్ణే. ఆ సావాసాలూ ఆ అలవాట్లూ నాకు ఎప్పుడు అలవడినవో జ్ఞాపకం లేదు. నాకు పది పన్నెండేళ్లు రాక పూర్వమే నేను ఇల్లు పట్టకుండా తిరగ సాగాను. నాకు అనేకమంది స్నేహితు లుండేవాళ్లు అంతా ధైర్యవంతులు, వాళ్ళ ధైర్య సాహసాలకు నేను భ్రమసిపోయినాను, నేను తలపెట్టటానికే అసంభవమైన పనులు వాళ్ళు ప్రతిరోజూ అనేకం చేసేవాళ్లు. మా అమ్మా మా నాన్నా నేను గొప్పవాణ్ణనీ, నా స్నేహితులు పట్టి వెధవలనీ, వాళ్ళ సహవాసం చేస్తే నేను చెడిపోతాననీ చెప్పేవాళ్లు. ఆ మాటలు నే నెట్లా విశ్వసించను! నా స్నేహితులు నాకన్న వెధవలు ఎంత మాత్రమూ కారు. వాళ్ళతో నన్ను సహవాసం చెయ్యనివ్వటమే నాకెంతో గొప్పగా ఉండేది. అంతేకాక మా పెద్దవాళ్ళకు దేనిదేనియందు గురి ఉండేదో వాటిలో ఒక దానియందుకూడా నాకు గురి లేదు. నాకు చదువులో గురి లేదు. నాకు చదువును చూస్తే అసహ్యం. మేష్టరును చూస్తే అసహ్యం. మంచి మార్కులు వచ్చే పిల్లలను చూస్తే అసహ్యం! నాకు నా స్నేహితులతో తిరగటమూ, చాటగా మామిడి కాయలూ, కొబ్బరి కాయలూ కొయ్యటమూ, టిక్కెట్టు లేకుండా నాట

కాలకూ సినిమాలకూ రైలుమీద దగ్గిర ఊళ్ళకు వెళ్ళిరావటమూ, నాతో విరోధం కట్టినవాళ్ళను తన్నించటమూ తప్ప ఇంకేమీ ఇష్టంలేదు. ఇదంతా తప్పని లోకం అనుకుందని నే నెరుగుదును కాని అది తప్పని నా మనసుకు తట్టలేదు. నా కర్థమయేటట్టు ఎవరూ బోధించలేదు.


నాకు పదిహేను పదహారేళ్ళు వచ్చేటప్పటికి నన్ను మావాళ్ళు "వదలిపెట్టి ఊరుకున్నారు!" వాళ్లు అపని చేసి నాకేదో పెద్ద శిక్ష ఇచ్చామనుకున్నట్టు కనపడ్డారు; కాని నా ప్రాణం మరింత సుఖపడ్డది. ఆ రోజులో నేను భోజనానికి మాత్రమే ఇంటికి వెళ్ళేవాణ్ణి. నాకు బీడీలకూ కాఫీకి కావలసిన డబ్బులు మా నాన్న నడిగో, మా అమ్మ నడిగో, ఇద్దరూ ఇవ్వకపోతే దొంగిలించో, అది కూడా వీలుపడకపోతే ఏమైనా వస్తువులు యింటినుంచి ఎత్తుకుపోయి అమ్మో సంపాదించేవాణ్ణి.

ఒకనాడు నా దొంగతనం పట్టుకొని మా నాన్న నన్ను చావగొట్టాడు. మా అన్నయ్యకు చదువుకోవ బోలెడంత ఖర్చు అయ్యేది. అదంతా నా కెందు కివ్వరు? నాకు రోజూ మూడణాలు కావాలి. మావాడి జీతానికే రోజూ అర్ధరూపాయి పడుతుంది. ఈ వాదన మా నాన్నకు నచ్చలేదు. నేనుకూడా చదువుకుంటే నాకూ డబ్బు లిస్తా నంటాడు. స్కూలు వాళ్ళ కివ్వటానికి ఆయనకు అభ్యంతరం లేదు. కాని నా కివ్వటానికి అభ్యంతరం.

ఒకనాడు మా అన్నయ్య నే నింటికి భోజనానికి వచ్చేటప్పటికి "తిండివేళకు మాత్రం ఇల్లు కనబడుతుంది అయ్యకు!" అని వెక్కిరించాడు నన్ను. నాకు వాణ్ణి చూస్తే మండిపోయింది. వాడిమీదపడి చావ గొట్టాను.

ఆ తరవాత మా నాన్న ఇంటికి రావద్దని శాసించాడు. నేను అమిత పొగరుగా "నేను రానేరాను. పో!" అని భోజనం చెయ్యకుండా వచ్చేశాను. ఇక ఆ యింట్లో అడుగు పెట్టకూడదనుకున్నాను. ఆ నాడల్లా నాకు తిండిలేదు. ఆ రాత్రి సత్రం అరుగుమీద పడుకుని ఆపుకోలేకుండా ఏడిచాను. నా కప్పుడు ఆకలి కూడా తెలియలేదు. కాని మా అమ్మ జ్ఞాపకం వచ్చింది. నా చిన్ననాటి సంగతంతా జ్ఞాపకం వచ్చింది. మా అమ్మను చూసి ఎంతో కాలమయినట్టుగా ఉంది నాకు.

మర్నాడు ఉదయమే సత్రంలో ఒకామెను "ఏమండీ, కాస్త చద్దెన్నం ఉంటే పెడతారూ? ఆకలి అవుతున్నది." అని అడిగాను. ఆవిడ నన్నుచూసి "ఎవరబ్బాయివి?" అంది. నాకు కోపం వచ్చి అక్కడి నించి కదిలాను. ఆవిడ వెనక్కు పిలిచి, "రా, నాయనా! ఎందుకు వెళ్ళిపోతావు? అన్నం పెడతా రా!" అన్నది.... మా అమ్మఅయినా నాకంత బాగా పెట్టిఉండదు; కాని నేను ఎక్కువ




తినలేక పోయినాను. ఇన్ని మంచినీళ్లు తాగి అక్కడినించి బయలుదేరాను. సాంబయ్య కొట్టులో ఒక బీడి అడిగి తీసుకుని అది కాల్చుకుంటూ మా స్నేహితులెవరైనా కనిపిస్తారేమో అని బయలుదేరాను.

గుడిదగ్గర సెకండు కంపెనీ వాళ్ళ గదిలో హార్మోనియం వాయింపు వినిపించింది. లోపలికి తొంగిచూస్తే హార్మోనిష్టుగారు పెట్టెదగ్గర కూర్చుని ఒక చేత్తో ఏదో వాయించుకుంటున్నాడు. లోపల ఇంకెవరూ లేరు. నేను మెల్లిగా లోపల ప్రవేశించి ఆయన దగ్గిరికి జరిగాను. ఆయన వాయించటం మానేసి నావంక చూసి, "ఎవరు నువ్వు?" అన్నాడు.

"ఏదన్నా వాయించండి!" అన్నాను. ఆయన వినిపించుకోలేదు.

కొంచెం ధైర్యంచేసి "నేను పాడితే వాయిస్తారూ?" అన్నాను.

ఆయన ఎగతాళిగా నవ్వి "ఏం పాడతావు?" అన్నాడు.

"ఏదన్నా పద్యం."

"పాడు." అన్నాడాయన శ్రుతిపెట్టి. ఆ శ్రుతి నాకు చాలా ఎక్కువయింది. ఇంకో శ్రుతి పెట్టాడు. నేను రామనాథశాస్త్రి పద్యం ఒకటి పాడాను.

"ఇంకోటి పాడు!" అంటూ ఆయన నాకు వాయించటం మొదలు పెట్టాడు.

"కీర్తన లేమన్నా వచ్చునా?" అన్నాడాయన. ఎవరో ఆడమనిషి—హీరాబాయి అనుకుంటాను!—రికార్డులో పాడిన కీర్తన ఒకటి నేను కల్పించుకున్న సాహిత్యంతో పాడాను.

మా కిద్దరికీ పొవాన పయింది.

"సుందర్రామయ్యగారిని రానీ. ఆయ నకు పాడి వినిపింతువుగాని!" అన్నా డాయన. నా సంతోషానికి మేరలేదు. నా చేతకూడా వేషాలు వేయించి డబ్బిస్తా రేమోనని నాకు ఆశపుట్టింది. నాకు వేషాలు వెయ్యాలని యెప్పుడూ వుండేది కాని వ న్నె వ రూ వెయ్యనివ్వరనీ, నాకు వెయ్యటం చాతకాదనీ అనుకునేవాణ్ణి.

సుందర్రామయ్యగారు కూడా నాచేత చాలాసేపు పాడించి నన్ను వీపుమీద తట్టి "భేష్!" అన్నాడు. అంతే! ఇంకేమీ జరగలేదు. నాకు కష్టంవేసింది. నే నా చోటు వదలిపెట్టి మళ్ళా బజారువెంట వడవసాగాను.

వీధివెంట సినిమావాళ్ల బండి వస్తు న్నది. ఆ బండిలో మా స్నేహితుడొకడు కాగితాలు పంచిపెట్టుతున్నాడు. నేనుకూడా ఆ బండిలోనే ఎక్కి వాడితో జరిగిందంతా చెప్పాను. వాడుకూడా సంతోషించి, "ఓరి వెధవా! వేషం వేస్తానని సుంద ర్రామయ్యతో అనక పోయినా పుట్రా? వాళ్ళంతట వాళ్ళే వేషం యిస్తారా!" అన్నాడు.

ఆ సాయంకాలం నా స్నేహితుడిచ్చిన రెండణాలుపెట్టి కాఫీహోటల్లో తిని ఒక కాపీ బీడీలు కొనుక్కుని సెకండు శంపెనీ వాళ్ళ గదికి మళ్ళీ వెళ్ళాను. వాళ్ళకు మళ్ళా వచ్చినందుకు కోపం వస్తుందేమో అని భయపడ్డాను కాని, హార్మొనిష్టుగారు నన్ను చూడగానే గుర్తుపట్టి, మళ్ళీ పాడ మన్నాడు. ఈసారి గదిలో చాలామంది వున్నారు. వాళ్ళంతా ఏమనుకుంటారో అని భయపడుతూ ఒక కీర్తన పాడాను. హార్మొనిష్టుగారు నన్ను ప్రోత్సహించి ఇంకొకటి పాడమన్నాడు.

నాకు వేషం ఇమ్మని సుందర్రామయ్య గారిని అడగటం మాత్రం నాచాత కాలేదు. సాయంకాలం ఆయనవెంట వారింటికి వెళ్ళి ఆయన ఇంట్లోకి వెళ్ల బోతుండగా పిలిచి భయపడుతూ అడి గాను. ఆయన కాస్సేపు అనుమానించి, "రేపు చూదాంలే" అన్నాడు.

నాటకాల్లో దిగి కాస్త పేరు సంపా దించటం మొదలుపెట్టగానే నా వెనకటి స్నేహితాలు తగ్గి కొత్త స్నేహితాలు జాస్తి అయినై. ఈ స్నేహితులకంటె వెనకటి స్నేహితులే మంచివాళ్ళనిపించేది నాకు. అయినా వీళ్ళకున్న నాగరికత నా వెనకటి స్నేహితులకు లేదు. వీళ్లు నాచేత డబ్బు ఖర్చుపెట్టించేవాళ్లు నాచేత పనులు చేయించుకునేవాళ్లు. నమ్మించి మోసం చేసేవాళ్లు. అయినా వీళ్ళ దుర్బుద్ధులకు అలవాటు పడిపోయినాను. నా వెనకటి స్నేహితులను నేను కావాలని వదలిపెట్ట లేదు. వాళ్ళంతట వాళ్ళే దూరంగా తొలగి పోసాగారు—నాకా రోజున సినిమావాళ్ళ బండిలో కనిపించినవాడు కూడా!

ఈ కొత్త స్నేహితులవల్ల నాకు తాగు డొకటీ, వేశ్యలొకటీ పట్టుబడినై.

తాగుడు నేను మరిపెట్టుకుని అలవాటు చేసుకున్నాను కాని, భోగంవాళ్ళు నన్ను పిలిపించుకుని నాచేత డబ్బు ఖర్చుపెట్టించే వాళ్లు మొదటమొదట వాళ్లు పిలిస్తే వెళ్ళితీరాలన్నట్టు వెళ్ళేవాణ్ణికాని క్రమముగా వాళ్ళను తప్పించుకుని తిరగటం నేర్చుకున్నాను. నాకు భోగంవాళ్ళు ఎన్నడూ సరిపడలేదు. వాళ్లు అబద్ధాలాడతారు. వాళ్లాడేవి అబద్ధాలని యెంత తెలివితక్కువ వెధవకుకూడా తెలుస్తూనే ఉంటుంది.

కాని నాకు ఇందుమతిమీద నిజంగా అపేక్ష పుట్టింది. మా ఇద్దరి సావాసమూ సంగీతం దగ్గర ప్రారంభమయింది? దాని మీద దాని తల్లి చాలా ఆశలు పెట్టుకున్నది. ఆ ముసలివానికి నెలకు అరవై రూపాయల జీతగాణ్ణి నేను అనలేదు (నిజానికి ఇందుమతి — మొదటపెట్టిన పేరు వెంకటనరసులు—చాలా అందగత్తె. చిన్నదీ, మంచిదీకూడానూ।) కాని ఇందుమతి నన్ను వదిలిపెట్టలేదు. నిజమైన స్త్రీసుఖం దాన్నించే నేను తెలుసుకున్నాను.

నాపేరు పేపర్లలో పడటం మొదలుపెట్టిన తరువాత నా జీవితంలో మరొక మార్పు జరిగింది. నాటకానికి యాభై చొప్పున యిచ్చి నన్ను పెద్దపెద్ద నటులంతా పిలవటంకూడా ముఖ్యవిషయం కాదు. కంపెనీవాళ్ళ మూకలోంచి లేచి నేను నాగరిక ప్రపంచంలో పడ్డాను। అమిత గొప్పగొప్ప వాళ్ళంతా—ప్లీడర్లేమిటి, మునసబులేమిటి, కవులేమిటి, పండితులేమిటి, అన్నిరకాలవారు—నన్ను చూడరావటమూ నాతో పరిచయం చేసుకోవటమూ ప్రారంభించారు. ఎప్పుడన్నా పొరుగూళ్లకు వెళ్లినప్పుడు అనేకమంది చదువుకున్న ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ మా లాడ్జికికూడా వచ్చి టీకీ, టిఫినుకూ కార్లమీద ఎక్కించుకుని తీసుకుపోసాగారు నన్ను.

ఈ రోజుల్లో నేను పశ్చాత్తాప పడసాగాను. నా చిన్నతనపు పాపాలకు, వీళ్లంతా పుట్టకలో నాకన్న ఎక్కువవాళ్ళు కారు. కాని, నేను నా బాల్యప్రవర్తన వల్ల ఈ సమాజానికి వెలి అయినాను. ఈ నాగరికత మధ్య నాకు తాత్కాలిక స్థానమేకాని మళ్లా నేను వెళ్ళవలసింది ఇందుమతి దగ్గిరకేగా। అది నేను రోజూ చూచే సంసారిస్త్రీలతో ఎన్నడూ సమానం కాదు। ఇతరులు తమతమ భార్యలను వెంటపెట్టుకుని ఎక్కడికైనా పోగలరు. గౌరవం పొందగలరు. నేను? నేనూ, నా ముండా। నా ముండవల్ల నాకు కొంత సుఖం లేదనికాదు—అంతకంటె ఎక్కువ లేదని।

ఒకప్పుడు నాగరికతను విరసించి ఉండటం నాదే పొరపాటు. నన్ను తప్పుపట్టిన నా తల్లిదండ్రులూ, మా అన్నయ్యా, నా బంధువులూ నామీద కట్టుకట్టారను కున్నాను. నేను సుఖపడటం వాళ్ళ కిష్టం

లేదనుకున్నాను. ఎంత పొరపాటూ!

నేను బాగుపడ్డందుకు అందరూ సంతోషించారు. నే నిప్పటికైనా వాళ్ల ప్రపంచంలో పడి బాగుపడతానని విశ్వసించుతున్నారు! వాళ్లు అప్పుడప్పుడూ వ్రాస్తూవచ్చిన ఉత్తరాలవల్ల నాకు ఆశ పుట్టటం మొదలుపెట్టింది — ముఖ్యంగా మా అన్న రాసిన ఉత్తరంవల్ల!

"....నువ్విప్పుడు లోకజ్ఞానం చాలా సంపాదించినావు! నీవు నేనేమీ చెప్ప నక్కర్లేదు. కాని నీ ధర్మం నువు నిర్వర్తించటం. అనగా నీకు తగిన పిల్లను వివాహం చేసుకుని ఆమెయందు సంతానం కనటం. నీ విధి! మనతో జాతి అంతం కాదు. మన పిల్లలకు సంఘంలో మన కున్న పరపతి ఉండాలి. ఉండటం విధి! నీ పేరు ప్రతిష్ఠలు అభివృద్ధి జనకొద్దీ నీకు నాగరికత గల భార్య. నాగరికత గల జీవనమూ మరింత అవసరం. నీ సుఖం విసర్జించమని నేను చెప్పటంలేదు. నీకు తగిన భార్యా సంసారమూ ఏర్పాటయితే దాని చాటున నువ్వేమి చేసినా కనిపించదు. బాగా ఆలోచించుకో!... ఇక్కడ ఒక దివ్యమైన సంబంధం ఉంది. నీ కభ్యంతరం లేకపోతే వచ్చి చూసిపో. నువు సరేనంటే ఒక్క క్షణంలో ముహూర్తం పెట్టించి పెళ్లి జరిపించుతాము!"


ట్లాగైనా విద్యావంతుడి రాత విద్యతో కూడుకుని ఉంటుంది!

మా అన్నయ్య సలహా బాగుంది. నేను ఇందుమతిని వదిలిపెట్టవలసిన అవసరంకూడా లేదు. కాని ఈ పెళ్ళి చేసుకుంటే నలుగురు బంధువులూ వస్తూ పోతూ వుంటారు. ఇల్లంటూ ఒకటి ఏర్పడి పచ్చపచ్చగా ఉంటుంది. నాకు పుట్టే పిల్లలకు సమాజంలో స్థానం ఉంటుంది. ఇప్పుడేముంది? బిక్కుబిక్కుమంటూ నేనూ ఇందుమతీ! మా యింటికి మర్యాదస్తు లెవరూ రారు. మాకు సమాజంతో ఏమీ సంబంధం లేదు. మేము అదృష్టం చాలక పిల్లలను కంటే వాళ్ళను మా అనంతరం దగ్గిరికి తీయవలసిన వాళ్లు ఇందుమతి చుట్టాలూ, నా స్నేహితులూ!

మా అన్న చెప్పినట్టు చెయ్యటానికి తీర్మానించుకున్నాను. అతను సంఘ మర్యాదలు గుర్తెరిగినవాడు. సంఘంలో పరపతి కలవాడు.

అతను నాకు సహాయం చెయ్యటానికి పూనుకోటమే నా అదృష్ట మనుకున్నాను. ఈ గొడవంతా ఇందూకు చెప్పటం దేనికీ?

తీరికగావున్న రోజుచూసి పొద్దు మైనంత త్వరలో మా అన్నగారుంటున్న ఊరు చేరాను. మా అన్నగారికి అక్కడ ఉద్యోగమయింది. మా అమ్మా, నాన్నా అక్కడే ఉంటున్నారు. వాళ్ళనందర్నీ చూసి ఏడేళ్ళయింది! మా అమ్మ నన్ను చూడగానే ఏడిచింది. నాకుకూడా కళ్లు తడి అయినై. మా నాన్న నన్ను చూడగానే "ఏమోయ్! ఇంకా మనిషి ఆకారం




లోనే ఉన్నావే! పుచ్చి పురుగులు పడి పోయినా వనుకున్నాను!" అన్నాడు. మా వదినగారు నన్ను విషప్పురుగును చూసి నట్టు చూడసాగింది. నాకు కష్టంవేసింది— కాని ఆండ తప్పేముందీ?

మా అన్నయ్య నన్ను చూసి చాలా సంతోషించాడు. నా పరివర్తనకు నన్ను చాలా శ్లాఘించాడు. తను ఆకాశాన్నించి వూడిపడ్డవాడిల్లే అనేక రకమైన ధోరణిలో మాటాడాడు కాని నేను అణకువతో సహించాను. వెక్కిరించడానికి నాకు నైతికంగా ఏమి హక్కున్నది?

"పిల్ల చాలా బాగుంటుంది. ఆచే భాగ్యవంతులు కారు కాని చాలా పరువు మర్యాదలు గల కుటుంబం. నీకు వాళ్ళు పిల్లనివ్వటానికి అంగీకరించటం నీ అదృష్టమే నని నిష్పక్షపాతంగా చెబుతాను.... పిల్లను సాయంకాలం చూతాము!" అన్నాడు మా అన్నయ్య.

నాలో ఒక విధమైన ఆందోళన ప్రారంభమయింది. ఈ పశ్చాత్తాపమూ పరివర్తనా నే ననుకున్నంత రుచికరంగా లేవు. నేను ఇంతకాలమూ బురదలో పొర్లాడి వచ్చానని నన్ను చూసిన ప్రతివాడూ నాకు జ్ఞాపకం చేస్తున్నాడు!.... దీనికి నేను తల ఒగ్గి తీరాలల్లే కనిపించింది. కానీ, ఏం చేస్తా మని తృప్తి పడ్డాను

ఆ సాయంకాలం మూడు గంటలకు నేనూ మా అన్నయ్యా పిల్లను చూడటానికి వెళ్ళాం. వారిల్లు చూడగానే నా ఉత్సాహం సహం చచ్చింది. పట్టి పూరి కొంప. మరీ దరిద్రులల్లే కనిపించారు. నాకు పిల్లనివ్వటానికి అంగీకరించిన పెదముసిలి మమ్మల్ని చూడగానే ఎంతో వినయ విధేయతలతో "రండి, రండి

దయచెయ్యండి!'' అని ఒక సలకకుక్కి-వాల్చాడు.

"ఇవాళ శివరామయ్యగారింట్లో తద్దినం పెట్టించి ఇప్పుడే వచ్చాను!'' అన్నా డాయన మా అన్నయ్యతో. నాకు మతి పోయినట్టయింది; మా అన్నగారు నిశ్చింతగా చిరునవ్వు నవ్వటం చూశాను

"పిల్ల దేదీ?'' అన్నాడు మా అన్నగారు.

"అ! అ! పిల్లది....ఒసే, పుణ్యవతివి ఇట్లా రమ్మనవే!''

పుణ్యవతి వచ్చింది! పదేళ్ళపిల్ల. నల్లగా ఉంది; మొహాన కాసీ పరిమాణం గల ఒక కాల్పుమచ్చ; మిట్టకళ్లు; పైన వెడల్పుగా ఉండి కిందికి కోలగావచ్చి గడ్డందగ్గర కొనతేలిన మొహం .. ఇక నే నేమీ గమనించలేక పోయినాను. మా అన్నగారూ ఆ పురోహితుడు పెళ్ళి నిశ్చయమైనట్టే మాట్లాడుతున్నారు.

నా కంతా అర్థమయింది. నేను పోగొట్టుకున్న నాగరికత ఇదీ నా ప్రాణానికి ఈ పిల్లే అందకత్తె! ఆ పురోహితుడు తన కూతుర్ని నా కివ్వటం నా అదృష్టం! అంతకంటె నేను ఎక్కువ కోరుతున్నా నని తెలిస్తే సంఘం నిర్ఘాంత పోతుంది!

"నువ్వు కాస్సేపుంటావా? నేను కాస్త పనిమీద వెళ్ళాలి!'' అన్నాను.

మా అన్నయ్య నా వంక చూసి గాలుచీగా నవ్వి. "సరే, పద! ఇంటిదగ్గరే ఉండు. నే నిప్పుడే వస్తున్నాను!'' అన్నాడు. నేను తల ఊపి బయటికివచ్చి టైము చూసుకున్నాను. నాకు తిరుగు బండి అందుతుంది....

నేను రైలులో ఎక్కగానే నే నెక్కిన పెట్టె పక్క పెట్టెలో ఒకాయన బిగ్గరగా అరవటం వినిపించింది.

"ఈ రోజుల్లో డబ్బు పెట్టి కొనుక్కో లేని దేముందండీ! డబ్బున్న చోటికి నాగరికత నడిచిరాదూ? వర్తకం ఉన్న చోట బస్తీలు ఏర్పడటంలేదూ? నీతిగా ఉండి డబ్బు లేని వాళ్ళకు సంఘంలో ఎక్కువ స్థానం ఉంటున్నదా? డబ్బుండీ నీతిలేనివాళ్ళకు ఎక్కువస్థానం ఉంటున్నదా?''

"అవును! నా బంధువులంతా నేను మారానని నన్ను కటాక్షించ లేదు. నేను డబ్బు సంపాదించుకున్నానని— ఒక్కొక్క నెల నాకు వెయ్యి రూపాయల ఆదాయంకూడా ఉంటున్నదని— మళ్ళా నాతో చుట్టరికం కలపవచ్చారు! ఈ వెధవ అందరిచేతా నా ఇంటూ అడుగులకు మడుగు లొత్తేటట్టు చేస్తాను! నా డబ్బుతో దానికి నాగరికత కలిగిస్తాను. దాన్ని నాగరికులకు మధ్య పెట్టి, సంసారి స్త్రీ లందరూ దాన్ని పూసుకుని తిరిగేటట్టు చేస్తాను. నా చుట్టూ ఉండే సాంఘిక జీవితం దాని చుట్టూ, సూర్యుడి చుట్టూ గ్రహాలు పరిభ్రమించి నట్టు పరిభ్రమించుతుంది! పాషనులకూ పేరంటానికి కూడా దానికే అగ్రతాంబూలం అవుతుంది!' అని ప్రతిజ్ఞ చేశాను

నా ప్రతిజ్ఞ ఎంతవరకు నెరవేర్చ గలిగానో లోకం ఎరుగును!

---